క్లుప్తంగా

31న పీహెచ్‌సీ నిర్మాణానికి భూమిపూజ

చాపాడు : మండలంలోని నక్కలదిన్నె గ్రామంలో నూతనంగా నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి ఈ నెల 31న భూమిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్ అండ్ బీ ఏఈ దాదా బాషా తెలిపారు. రూ.2.42 కోట్లతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి చేతుల మీదుగా భూమిపూజ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని వైద్య, ఆరోగ్య శాఖాధికారులు, ఆర్ అండ్ బీ అధికారులు హాజరవుతారని ఆర్ అండ్ బీ ఏఈ తెలిపారు.

నేడు రాజువారిపేటలో ఫ్యామిలీ డాక్టర్

చాపాడు : ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని రాజువారిపేటలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9:30గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి అన్ని రకాలైన వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేస్తామని వైద్యాధికారి తెలియజేశారు.

జీవన ఎరువులతో నాణ్యమైన దిగుబడి

మైదుకూరు : జీవన ఎరువుల వాడకంతో నాణ్యమైన పంట దిగుబడి పొందవచ్చని మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. శుక్రవారం ఆదిరెడ్డిపల్లె, సోమిరెడ్డిపల్లె, పప్పనపల్లె గ్రామాలకు చెందిన రైతులకు కేంద్రంలో జీవన ఎరువులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే ఇన్‌చార్జి అధిపతి, శాస్త్రవేత్త ఎం.హర్షిత, ఫిరోజ్ హుస్సేన్, రైతు నాయకుడు బీపీ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు పద్మశాలీయ విద్యార్థులకు పురస్కారాల ప్రదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పద్మశాలీయ కళ్యాణమండపంలో ఆదివారం ఉదయం 10 గంటలకు పద్మశాలీయ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో 25వ ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు వద్ది నరసింహులు ఓ ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన, ఎంసెట్, జేఈఈ, నీట్, మెడిసిన్, ఇంజనీరింగ్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన పద్మశాలీయ విద్యార్థులకు ఈ పురస్కారాలను అందిస్తున్నామన్నారు. అలాగే 55 ఏళ్ల పైబడి చేనేతవృత్తి చేస్తున్న పద్మశాలీయ నేతన్నలకు సత్కారం, నగదు పురస్కారాలను ప్రదానం చేస్తున్నామని వివరించారు.

చేనేత కార్మికులకు రుణాలు ఇవ్వాలి

ప్రొద్దుటూరు : కేంద్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు ప్రవేశపెట్టిన రూ.లక్ష చొప్పున ముద్రా రుణాలను మంజూరు చేయాలని ఏపీ చేనేత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాలా రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు వారు వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వం నిర్మిస్తున్న పక్కా గృహాలకు పెండింగ్ లేకుండా బిల్లులు మంజూరు చేయాలని, రూ.1.80 లక్షలు కాకుండా అదనంగా రూ.30వేలు మంజూరు చేయాలని కోరారు. 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటకృష్ణయ్య, జిల్లా చేనేత కార్మిక సంఘం కార్యదర్శి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

ప్రొద్దుటూరు క్రైం : ఈ నెల 28న అనంతపురంలో నిర్వహించనున్న ఎస్సీ జనసంఘం 6వ వార్షికోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దరాజు, గౌరవాధ్యక్షుడు పసుపులేటి శివకృష్ణలు అన్నారు. మండల పరిధిలోని సుందరయ్యనగర్‌లో శుక్రవారం స్థానికులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ అధ్యక్షుడు దాసగాని కుల్లాయప్ప హాజరవుతున్నారన్నారు.

రేపు రైతులకు పత్రాల పంపిణీ

చాపాడు : స్థానిక వైఎస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం మండలంలోని చుక్కల భూముల బాధితులకు నిషేధిత తొలగింపు పత్రాలను పంపిణీ చేయనున్నట్లు మండల తహసీల్దారు సుభాని తెలిపారు. ఉదయం 9గంటలకు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి చేతుల మీదుగా మండలంలోని 3755 మంది రైతులకు చెందిన 3623 ఎకరాలకు చెందిన చుక్కల భూముల నిషేధిత పత్రాలను పంపిణీ చేస్తామని బాధిత రైతులందరూ హాజరుకావాలని తహసీల్దారు కోరారు.

జీపుజాతను జయప్రదం చేయండి

బద్వేలు అర్బన్ : ఈనెల 31 నుంచి జూన్ 9వ తేదీ వరకు జరగనున్న మున్సిపల్ కార్మికుల రాష్ట్ర వ్యాప్త జీపుజాతను జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ మాజీ రాష్ట్ర కార్యదర్శి కె.నాగేంద్రబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జీపుజాతకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకులు చిన్ని, సుబ్బరాయుడు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్యాంప్రవీణ్, హరి, నాగేంద్రబాబు, సత్యరాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కోరారు. మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌లో శుక్రవారం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి సంబంధించి 14,885, ప్రొద్దుటూరు మండలానికి సంబంధించి 6037, రాజుపాళెం మండలానికి సంబంధించి 564 కలిపి నియోజకవర్గానికి మొత్తం 21,486 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. వీటిలో ఇప్పటి వరకు 1958 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయన్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి తాను ఎప్పుడూ పూర్తి సహాయ సహకారాలు అధికారులకు అందిస్తున్నానని తెలిపారు. ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఆనంద్ నాయక్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, తహసీల్దార్ నజీర్ అహ్మద్, ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి, డీఈ రామ్మోహన్, ఏఈలు అశ్వర్థరెడ్డి, వెంకటేశ్వర్లు, మెప్మా టీఈ కెజియా జాస్లిన్ తదితరులు పాల్గొన్నారు.



హీరో, హీరోయిన్ నవీన్, రోహిణిలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

'జైత్ర' సినిమా తిలకించిన ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి శుక్రవారం స్థానిక సినీ హబ్ థియేటర్‌లో ఆడుతున్న జైత్ర సినిమాను తిలకించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాయలసీమ నేపథ్యంతో పులివెందుల ప్రాంతానికి చెందిన యువకులు ఈ సినిమా తీశారన్నారు. ప్రధానంగా రాయలసీమలో రైతులు సాగు చేస్తున్న భూముల ప్రాధాన్యత గురించి సినిమాలో చక్కగా వివరించారన్నారు. ఈ ప్రాంతం యాస, మాటలు, మన పల్లెలను గుర్తు చేస్తాయని తెలిపారు. డైరెక్టర్ మల్లికార్జున నేతృత్వంలో హీరో నవీన్, హీరోయిన్ రోహిణి చక్కగా నటించారన్నారు. అనంతరం నటీ, నటులను ఎమ్మెల్యే సన్మానించారు.

అధికారులు సమయం పాటించాలి

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ధనలక్ష్మి

గోపవరం : మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు సమయానికి రావడంలేదని ఎంపీపీ ధనలక్ష్మి అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు సమావేశం ఉందని వారం రోజుల క్రితమే అన్నిశాఖల అధికారులకు సర్క్యులర్ పంపించినా అధిక శాతం మంది అధికారులు ఉదయం 11–30 గంటల వరకు కూడా సమావేశానికి హాజరుకాకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్‌లతో పాటు పాలక మండలి సభ్యులు అధికారులు వచ్చేంత వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇకమీదట అలా జరగకుండా సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఆమె తెలిపారు. కొందరు సమావేశానికి గైర్హాజరవుతున్నారని, సభ్యులు లేవనెత్తిన అంశాలకు ఎవరు సమాధానం చెబుతారని ఆమె ప్రశ్నించారు. మండల ప్రత్యేకాధికారి నాగరాజ, ఎంపీడీఓ హరినారాయణలు మాట్లాడుతూ సమావేశానికి ముందు రోజే జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి నివేదికలు ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఎవరూ ఇవ్వడం లేదని అసహనం వ్యక్తం చేశారు. తహసీల్దారు దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యలు ఏవైనా ఉంటే ఆయా సచివాలయాల్లో నిర్వహించే స్పందన కార్యక్రమం దృష్టికి తీసుకువచ్చినా పరిష్కరిస్తామన్నారు. ఏఓ అరవిందనాయక్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం అందించే రైతుభరోసా మొదటి విడత రూ.7500లు ఈనెల 30వ తేదీన రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. ఇంకా రైతుభరోసా రాని రైతులు ఎవరైనా ఉంటే వెంటనే ఆయా రైతుభరోసా కేంద్రాల్లో వివరాలు అందజేసి నమోదు చేయించుకోవాలన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు లక్ష్మీదేవి, సరిత, నాగేంద్ర, శ్రీనివాసులు, ఎంపీటీసీలు సరస్వతి, రాజేశ్వరి, రామ్మోహన్‌రెడ్డి, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ధనలక్ష్మి

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

బద్వేలు అర్బన్ : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బద్వేలు తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఒక్కరోజు నిరాహారదీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌కుమార్, సుదర్శన్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన పీఆర్సీ బకాయిలను విడుదల చేయడంతో పాటు కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు హుస్సేనయ్య, పుష్పరాజు, ఉపాధ్యక్షులు బాలయ్య, ప్రసాద్, బ్రహ్మజీ, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మీనాక్షిరెడ్డి, బ్రహ్మయ్య, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయకుమార్, వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంజీవరాయ స్వామి సన్నిధిలో జిల్లా జడ్జి



జిల్లా ప్రధాన న్యాయమూర్తి దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ, వేద పండితులు

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వాములను శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయ మూర్తి దంపతులు దర్శించుకున్నారు. వారిని ఈఓ నరసయ్య, ఆలయ చైర్మన్ కానాల విజయలక్ష్మి, వేదపండితులు పూర్ణకుంభం, పట్టు వస్త్రాలతో ఘనంగా స్వాగతం పలికారు. వారు స్వాములకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం శాలువ కప్పి పూలమాల వేసి సంజీవరాయ స్వామి చిత్రపటాన్ని జ్ఞాపికను అందజేశారు. ఎస్‌ఐ రాజగోపాల్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్ పాల్గొన్నారు.

అందరూ కలిసికట్టుగా పనిచేయాలి



ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి వర్గాన్ని పార్టీలోకి ఆహ్వానిస్తున్న సురేష్‌బాబు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు

జమ్మలమడుగు : వచ్చే ఎన్నికలను అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకుని తిరిగి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేందుకు తమవంతు బాధ్యతగా ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డికి సహకరించి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం పెద్దముడియం మండలంలోని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డికి చెందిన నాయకులు, కార్యకర్తలతో, అలాగే ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్సీ ఇంటి వద్ద కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ రామసుబ్బారెడ్డి వైఎస్సార్‌సీపీలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానాన్ని కల్పించారన్నారు. ఆదేవిధంగా కార్యకర్తలు, నాయ కులు వర్గాలను మరచి వైఎస్సార్‌సీపీ కోసం కలిసికట్టుగా పనిచేసి భారీ మెజారిటీతో వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పెద్దముడియం మండలంలో నాయకులందరూ కలిసికట్టుగా పనిచేస్తే వైఎస్సార్‌సీపీకి భారీ మెజార్టీ రావడం ఖాయం అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి వర్గాన్ని సురేష్‌బాబు, ఎమ్మెల్యే మూలె సుధీర్‌రెడ్డిలు కలిసి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

వెబ్ కౌన్సెలింగ్ విధానం వద్దని వినతి

కడప ఎడ్యుకేషన్: విద్యాశాఖలో నిర్వహిస్తున్న పదోన్నతుల ప్రక్రియను వెబ్ కౌన్సెలింగ్ ద్వారా కాకుండా మాన్యువల్‌గా నిర్వహించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌లు కోరారు. ఈ విషయమై శుక్రవారం డీఈఓ రాఘవరెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెబ్ కౌన్సెలింగ్ ద్వారా పదోన్నతులు నిర్వహించడం వలన ఉపాధ్యాయులు ఏ ప్రాంతానికి వెళ్లవలసి వస్తుందోనన్న భయాందోళనలో పదోన్నతులను నిరాకరిస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ మంత్రి ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా పదోన్నతులు నిర్వహిస్తామని హామీ ఇచ్చినప్పటికీ విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈ విషయంలో అతి ఉత్సాహాన్ని ప్రదర్శిస్తూ వెబ్ కౌన్సెలింగ్‌ను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులను మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, ట్రెజరర్ దావుద్దీన్, నాయకులు కరీముల్లా, కిరణ్‌కుమార్, శ్యాసుందర్, ప్రాకాష్, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

నేడు ర్యాలీ

ప్రొద్దుటూరు : ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సమ్మేళనంలో భాగంగా శనివారం కడపలో నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలని అంగన్‌వాడీ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు ఎస్.మంజుల కోరారు. స్థానిక ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడప నగరంలోని పాత కలెక్టరేట్ ఆఫీసు నుంచి మున్సిపల్ హైస్కూల్ వరకు ఈ ర్యాలీ జరుగుతుందన్నారు. కార్మికుల సమస్యలపై రెండు రోజులపాటు జరిగే రాష్ట్ర సమ్మేళనంలో చర్చిస్తారన్నారు. ఏఐటీయూసీ పరిధిలోని అన్ని విభాగాల రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు.

టేకూరుపేటలో పరిశుభ్రత కార్యక్రమం

పోరుమామిళ్ల : మండలంలోని టేకూరుపేటలో దేవస్థానం, దర్గాల ఆవరణలో శుక్రవారం ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ శ్రీకృష్ణ ఆధ్వర్యంలో అటవీ సిబ్బంది ప్రజలతో కలసి పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు, బాటిల్లు, చెత్త, చిత్తు కాగితాలు ఏరివేశారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ మాట్లాడుతూ ఇంట్లో శుభకార్యాలకు, ఫంక్షన్లకు మొక్కలు నాటే అలవాటు పెట్టుకోవాలన్నారు. అందరితో ప్రతిజ్ఞ చేయించారు. సిబ్బంది కరుణాకర్, వెంకటేష్, కిశోర్ పాల్గొన్నారు.

ఎస్టీయూఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

బద్వేలు అర్బన్ : స్థానిక ఎన్‌జీవో హోంలో శుక్రవారం నిర్వహించిన ఎస్టీయూఫ్ కార్యవర్గ సమావేశంలో గోపవరం మండల నూతన ఎస్టీయూఫ్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎస్టీయూఫ్ గోపవరం మండల అధ్యక్షుడిగా వై.రవీంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సింగసాని పుల్లయ్యలను ఎన్నుకున్నారు. సమావేశంలో ఎస్టీయూఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు మురళి, ప్రధాన కార్యదర్శి సుబ్బరాజుయాదవ్, జిల్లా నాయకులు శ్రీనివాసులు, షరీఫ్, రాజారావు, ఈశ్వరయ్య, అయ్యవార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం

ప్రొద్దుటూరు క్రైం : వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ నేరాల్లో పట్టుబడిన బైక్‌లను శుక్రవారం సాయంత్రం బహిరంగ వేలం నిర్వహించారు. వివిధ కంపెనీలకు చెందిన 20 మోటార్ బైక్‌లను ఏఎస్పీ ప్రేరణాకుమార్ ఆధ్వర్యంలో వేలం వేయగా రూ.2.75 లక్షలు ఆదాయం వచ్చినట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు. ఆర్టీఓ నిర్ణయించిన ధరల మేరకు వాహనాలను వేలంలో ఉంచామని సీఐ అన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

బద్వేలు అర్బన్ : స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని మున్సిపల్ కార్యాలయంలో గల సమావేశ హాలులో శనివారం ఉదయం 10–30 గంటలకు మున్సిపల్ చైర్మన్ వి.రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మున్సిపల్ వైస్‌చైర్మన్లు, అన్ని వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ జాతర

బద్వేలు అర్బన్ : పట్టణంలోని కాపువీధి, బెస్తవీధి, అమ్మవారిశాలవీధి కూడలిలోని సత్యమ్మతల్లి ఆలయంలో జాతర సందర్భంగా శుక్రవారం నిర్వహించిన చల్ల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి బోనాలు సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. గ్రామం సుభిక్షంగా ఉండటంతో పాటు వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో విరసిల్లాలని కోరుతూ బోనాలు సమర్పించారు. ఆలయంలోని ఆంజనేయస్వామి విగ్రహానికి రాకేష్ అనే భక్తుడు వెండి కిరీటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పెద్దసుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, బోలానారాయణ, తేజ, సూర్యనారాయణరెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



సత్యమ్మతల్లికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని కొండావధూత ఆశ్రమం, గోవిందయ్య మఠం ఆవరణలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ నవమ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం కమనీయంగా సాగింది. స్వామివార్ల కల్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం స్వామివార్లకు హనుమంత వాహనంపై గుడి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి, దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి సి.శివయ్య, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పలు రాష్ట్రాలకు వలంటీర్ల వ్యవస్థ ఆదర్శం

బద్వేలు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థ దేశంలోనే పలు రాష్ట్రాలకు ఆదర్శమని బద్వేలు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. పోరుమామిళ్లలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లివీడు సచివాలయానికి చెందిన కళావతికి సేవా వజ్ర అవార్డును అందజేశారు. మరో 5 మందికి సేవా రత్న అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధినిర్వహణలో వలంటీర్లు చూపిస్తున్న సేవానిరతి ఎనలేనిదన్నారు. రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహంగా సేవలందించి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. అధికారులు సైతం తమ ప్రభుత్వం నిర్దేశించి లక్ష్యాలను అందుకుని ప్రజల అభివృద్ధికి సహకారం అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాలప్రసాద్, వైస్ ఎంపీపీ చెన్నురాజశేఖర్, సాంస్కృతిక మండలి రాష్ట్ర డైరెక్టర్ శకునాల ఈశ్వరమ్మ, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షులు కల్లూరు రమణారెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్డీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

వైఎస్సార్ కల్యాణమస్తు పంపిణీ



రూ.లక్ష అందిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక బొల్లవరంలోని సచివాలయం –1 పరిధిలోని హరిజన వాడకు చెందిన మేకల శ్వేత, మధు దంపతులకు వైఎస్సార్‌కల్యాణ మస్తు పథకం కింద మంజూరైన రూ.లక్ష వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి అందించారు. శుక్రవారం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కల్యాణమస్తు పథకం పేద ఆడపిల్లల తల్లిదండ్రులకు ఒక వరమని తెలిపారు. పెళ్లి చేయడం అనేది ఎంతో ఖర్చుతో కూడుకున్నదని, పేదలకు చేయూతనివ్వడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కల్యాణమస్తు పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో బొల్లవరం ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గోనా ప్రభాకర్‌రెడ్డి, సచివాలయ అడ్మిన్ అనిల్‌కుమార్‌రెడ్డి, వెల్ఫేర్ కార్యదర్శి రాజారెడ్డి, వలంటీర్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

రాత్రివేళల్లో గస్తీ ముమ్మరం చేయాలి

మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్

బద్వేలు అర్బన్ : మైదుకూరు సబ్ డివిజన్‌లోని ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో రాత్రి సమయంలో గస్తీ ముమ్మరం చేయాలని మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్.వంశీధర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం స్థానిక అర్బన్ స్టేషన్‌లో అర్బన్, రూరల్ సీఐలతో చోరీల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి వేళల్లో విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది వద్ద తప్పనిసరిగా ఫింగర్‌ప్రింట్ డివైస్ ఉండాలని, తద్వారా ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వారి వివరాలు తెలుసుకునేందుకు దోహదపడుతుందన్నారు. ప్రతిరోజు రాత్రివేళల్లో హోటళ్ళు, లాడ్జిలు తనిఖీ చేసి అందులో బస చేసిన వారి వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. భద్రతా చర్యల్లో భాగంగా దుకాణాలు, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అర్బన్, రూరల్ సీఐలు వెంకటేశ్వర్లు, హనుమంతనాయక్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



సీఐలతో చర్చిస్తున్న డీఎస్పీ వంశీధర్‌గౌడ్

సమ్మర్ క్యాంపును వినియోగించుకోవాలి

వేముల : గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ లింగాల ఉషారాణి తెలిపారు. వేములలోని స్థానిక గ్రంథాలయ శాఖలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాలను శుక్రవారం ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం చేసినప్పుడే మంచి అలవాట్లు, నడవడిక, వినయ విధేయతలు అలవడుతాయన్నారు. చిన్న పిల్లలు ఈ వయస్సు నుంచే పుస్తకాలను చదవడంవల్ల గొప్ప ప్రయోజకులవుతారన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఉంటుందన్నారు. వేములలో రూ.41 లక్షల పాడా నిధులతో నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణాలను అధికారులతో మాట్లాడి పూర్తి చేసేందుకు సహకరిస్తామన్నారు. సమ్మర్ క్యాంపులో పిల్లలకు మంచి కథలు వినిపిస్తారని.. మానసిక ఉల్లాసం కోసం డ్యాన్స్, ఆటల పోటీలు, డ్రాయింగ్‌లు నిర్వహిస్తున్నామన్నారు.

పొలతల దేవస్థానం అభివృద్ధికి కృషి

పెండ్లిమర్రి : పొలతల మల్లేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. పొలతల దేవస్థానంలో శుక్రవారం తిరుమల తిరుపతి దేవస్థానం–శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక నిధులతో రూ.3.64 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలతల క్షేత్రంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని చర్యలు చేపడతామన్నారు. ఇప్పటికే క్షేత్రంలో నూతనంగా అక్కదేవతలు, పులిబండెన్న, పుట్ట అంజనేయస్వామి ఆలయ నిర్మాణాలు పూరైయ్యాయన్నారు. ప్రస్తుతం మల్లేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం వద్ద రాజగోపుర నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. టీటీడీ వారి ఆర్థిక నిధులతో అన్నదాన బిల్డింగ్, గెస్ట్‌హౌస్, పది వసతి గదులు, డార్మెంటరి హాల్, టాయిలెట్స్ బ్లాక్ వంటి నిర్మాణ పనులకు భూమి పూజ చేశామన్నారు. పొలతల దేవస్థానంకు ఆర్థిక నిధులు అందించిన టీటీడీ చైర్మన్ వై.వీ.సుబ్బారెడ్డి, టీటీడీ ఈఓ ధర్మారెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఈఓ మహేశ్వర్‌రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు నాగమల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, సుబ్బిరెడ్డి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



పొలతలలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

చింతకొమ్మదిన్నె : రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం 17వ డివిజన్‌లోని చిన్నముసలిరెడ్డిపల్లె, అంగడివీధి గ్రామాల్లో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి మట్లాడారు. కులం, మతం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, 17వ డివిజన్ కార్పొరేటర్ గుత్తిరెడ్డి చంద్రహాసరెడ్డి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు వెంకటరెడ్డి, నాగరాజు, సర్పంచులు సురేంద్రారెడ్డి, మల్లి ఖార్జున యాదవ్, సింగిల్ విండో అధ్యక్షుడు రాజా రెడ్డి, గజ్జల శ్రీరామిరెడ్డి, 17వ డివిజన్ ఇన్‌చార్జ్ గుత్తిరెడ్డి లక్ష్మీరెడ్డి, మట్టి శ్రీనివాసులు రెడ్డి, నాయకులు చిన్నసిద్దయ్య పాల్గొన్నారు.